

హెచ్ఎంపీవీ కలకలం

చైనాను గడగడలాడిస్తున్న హెచ్ఎంపీవీ భారత్‌కు చేరుకోవడంతో కేంద్రం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది.

- 8లో



ఐలోని జాతరను విజయవంతం చేయాలి

ఐలోని మల్లన్న జాతరను విజయవంతం చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అధికారులను ఆదేశించారు.

- 8లో

గరిష్ఠం/కనిష్ఠం
$30^0/14^0$

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత మరింత పెరుగుతుంది.

స్థానిక సమరానికి సై

త్వరలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎలక్షన్లు
- జెడ్పీకి చేరిన ఎన్నికల సామగ్రి
- సమాయత్తమవుతున్న రాజకీయ పార్టీలు





హనుమకొండ జెడ్పీకి చేరుకున్న ఎన్నికల సామగ్రి

హన్మకొండ: స్థానిక సంస్థల 'సమరానికి' ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనేది స్పష్టంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించనప్పటికీ.. ఎన్నికల సామగ్రి సమకూర్చుకుంటున్నది. ఏ క్షణాన్నైనా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడవచ్చనే సంకేతాలు దీనిద్వారా తెలుస్తోంది. మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ(ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల(జెడ్పీటీసీ) ఎన్నికలను జిల్లా పరిషత్‌ల ద్వారా రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్వహిస్తుంది. ఈ క్రమంలో జిల్లా పరిషత్‌లకు మెటీరియల్ సరఫరా చేసింది. గ్రామ పంచాయతీ ఎన్నికలు పార్టీలకు అతీతంగా జరుగుతాయి. అయితే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరుగుతాయి. ఎన్నికలకు అవసరమైన కవర్లు, బ్యాలెట్ పత్రాలకు సంబంధించిన పేపర్, ఎన్నికల నియమావళికి, ఎన్నికల మార్గదర్శకాల కరదీపికలు జెడ్పీలకు చేరుకున్నాయి. నామినేషన్ల స్వీకరణ, ఉప సంహరణ అనంతరం బ్యాలెట్ పత్రాలు ముద్రిస్తారు. అయితే, బ్యాలెట్ పత్రాలకు అవసరమైన పేపర్‌ను ముందుగానే జిల్లాకు ఎన్నికల కమిషన్ చేరవేసింది.

పునర్విభజనతో మారిన జిల్లాలు..

జిల్లాల పునర్విభజనతో పూర్వ వరంగల్‌ను.. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలుగా ఏర్పాటు చేశారు. గత స్థానిక సంస్థల ఎన్నికలు ఈ జిల్లాల ప్రాతిపదికన జరిగాయి. అయితే వరంగల్ అర్బన్‌ను హనుమకొండగా, వరంగల్ రూరల్‌ను వరంగల్ జిల్లాగా పునర్విభజించారు. వరంగల్ అర్బన్ జిల్లా పరిషత్ పరిధిలో ఏడు మండలాలు, వరంగల్ రూరల్ జెడ్పీ పరిధిలో 16 మండలాలు ఉన్నాయి. ఈ రెండు జిల్లాల పునర్ వ్యవస్థీకరణతో హనుమకొండ జిల్లాలో 12 మండలాలు, వరంగల్ జిల్లాలో 11 మండలాలు చేరాయి. వరంగల్ రూరల్ జిల్లాలోని పరకాల, శాయంపేట, దామెర, నడికూడ, ఆత్మకూరు మండలాలను హనుమకొండ జిల్లాలో కలిపారు. వరంగల్ అర్బన్ జిల్లాలోని ఐనవోలు, హసన్‌పర్తి, వేలేరు, ధర్మసాగర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కమలాపూర్‌తో పాటు వరంగల్ రూరల్ జిల్లా పరిషత్ పరిధిలోని పరకాల, శాయంపేట, దామెర, నడికుడ, ఆత్మకూరు మండలాలను కలిపి హనుమకొండ జిల్లా పరిషత్‌గా ఏర్పాటు చేశారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆశావహుల సమాయత్తం..

రాష్ట్ర ఎన్నికల కమిషన్ జిల్లాలకు ఎన్నికల సామగ్రి పంపిస్తున్నట్లు ప్రచారం కావడంతో రాజకీయ పార్టీలు, ఆశావహులు ఎన్నికలకు సమాయత్తమవుతున్నారు. పార్టీల వారీగా జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీల అగ్రనాయకుల మెప్పు కోసం తాపత్రయపడుతున్నారు. టికెట్ దక్కించుకునేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల దృష్టిని ఆకర్షించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మరో వైపు అధికార పార్టీ స్థానిక సంస్థలను పూర్తి స్థాయిలో కైవసం చేసుకోవాలని ఇప్పటి నుంచే నాయకులకు సూచనలు చేసింది. మరో వైపు విపక్షాలు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఎలాగైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని ప్రణాళికతో ముందుకు పోతున్నాయి.

పంచాయతీరాజ్ చట్టంలో మార్పు..

గత ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో రెండు పర్యాయాలకు రిజర్వేషన్లు అమలయ్యేలా చట్టం చేసింది. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి పంచాయతీరాజ్ చట్టంలో మార్పు చేసింది. రిజర్వేషన్లు ఒక పర్యాయానికి వర్తించేలా మార్పులు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో ముందుగా ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా.. జెడ్పీ చైర్‌పర్సన్లు, మండల పరిషత్ అధ్యక్షుల రిజర్వేషన్లు ఖరారైతే రాజకీయ ముఖచిత్రం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఆశావహులు మాత్రం రిజర్వేషన్లు కలిసి వస్తే ఎలాగైనా పోటీ చేయాలనే ఆసక్తితో రాజకీయ పెద్దలను ప్రసన్నం చేసుకుంటున్నారు. పోలింగ్ బూత్‌ల పరిశీలనకు ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంటే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై స్పష్టత వస్తుంది.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, పక్కన కలెక్టర్, మేయర్ తదితరులు



అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- హనుమకొండ కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష

హన్మకొండ అర్బన్: అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో మంగళవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గస్థాయి సమీక్ష నిర్వహించారు. మేయర్ గుండు సుధారాణి, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినితానాజీ వాకడే హాజరైన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. భద్రకాళి బండ్, వడ్డేపల్లి బండ్ పనులు, బాలసముద్రం, పోతననగర్‌లోని జీడబ్ల్యూఎంసీ డంపింగ్ యార్డులు పూర్తిచేయాలని సూచించారు. ప్రధాన రహదారుల విస్తరణకు అధికారులకు ప్రత్యేక అధికారాలు ఇస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ బస్టాండ్ జంక్షన్ నుంచి కాంగ్రెస్ భవన్ వరకు ఎడమ వైపు ఉన్న ప్రభుత్వ స్థలాన్ని వెడల్పు చేస్తే రోడ్డుపై ట్రాఫిక్ నియంత్రణ ఉంటుందని పేర్కొన్నారు. భద్రకాళి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని, పార్కింగ్ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని చెప్పారు. జీడబ్ల్యూఎంసీ, ఆర్టీసీ బస్ స్టేషన్, రిజిస్ట్రేషన్ కార్యాలయ ఆవరణలో ఇందిరా మహిళా శక్తి కాంటీన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తియినందున పాలిటెక్నిక్ కళాశాలకు శంకుస్థాపన చేసి పనులను వేగవంతం చేయాలని కోరారు. ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేయాలని, అసంపూర్తి గృహాల నిర్మాణం చేపట్టాలని పేర్కొన్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీఓ రాథోడ్ రమేశ్, జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్ రవీందర్, ట్రాఫిక్ ఏసీపీ భానుకిరణ్, 'కుడా' ఈఈ భీంరావు, ఇరిగేషన్ ఈఈ సీతారాంనాయక్, ఆర్‌అండ్‌బీ ఈఈ సురేశ్‌బాబు, హౌసింగ్ నోడల్ అధికారి రాజేందర్, తహసీల్దార్లు భావ్‌సింగ్, శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

హన్మకొండ చౌరస్తా: పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ పథకాన్ని అమలు చేస్తామని హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని డీసీసీ భవన్‌లో మంగళవారం కాంగ్రెస్ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులతో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ, అర్హుల ఎంపికపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, ఈవీ శ్రీనివాసరావు, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమన్నారాయణ, విజయశ్రీరజాలీ, మాజీ కార్పొరేటర్ అబూబక్కర్, బొమ్మతి విక్రమ్, ఏనుగుల రాంప్రసాద్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కేయూ దూరవిద్య పీజీ పరీక్షలు షురూ..



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య పీజీ సైన్స్ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కాకతీయ యూనివర్సిటీలోని విద్యా కళాశాలలో పరీక్షల నిర్వహణ తీరును రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి పద్మజ పరిశీలించారు. వారి వెంట విద్యా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.రణధీర్‌రెడ్డి, దూరవిద్య కేంద్రం సైన్స్ కోర్సుల అసిస్టెంట్ డైరెక్టర్ బి.వెంకట గోపీనాథ్ ఉన్నారు.

కేడీసీలో బోర్డు ఆఫ్ స్టడీస్ సమావేశం



విద్యారణ్యపురి: హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) జువాలజీ విభాగంలో మంగళవారం బోర్డు ఆఫ్ స్టడీస్ సమావేశం నిర్వహించారు. సిలబస్, పరీక్షలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. యూనివర్సిటీ నామినీగా కేయూ జువాలజీ విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, కేడీసీ ప్రిన్సిపాల్ రాజారెడ్డి, జువాలజీ విభాగం అధిపతి సంజీవయ్య, సబ్జెక్టు నిపుణులు కె.గణేశ్, సభ్యులు అనిల్, వి.రాజయ్య, పి.రోహిణి, స్వామి అధ్యాపకులు పాల్గొని చర్చించారు. అటానమస్ స్టేటస్ లభించిన తర్వాత కేడీసీ ఈ విద్యాసంవత్సరం నుంచి సొంతంగా పరీక్షలు నిర్వహించనుంది.

'పేరిణి' రంజిత్‌కు అవార్డు



హన్మకొండ కల్చరల్ : వరంగల్‌కు చెందిన ప్రముఖ పేరిణి నాట్యాచార్యులు, నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమీ వ్యవస్థాపకులు గజ్జెల రంజిత్ సింగిడీస్ డిస్టింగ్విష్డ్ ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సింగిడి కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన సోమవారం రాత్రి సింగిడి ఇంటర్నేషనల్ కల్చరల్ ఫెస్ట్–2025 నిర్వహించారు. సింగిడి కల్చరల్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ డాక్టర్ విశ్వకర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ టి.గౌరీశంకర్ అవార్డులు ప్రదానం చేశారు.

దేవాదాయశాఖ డీసీ బదిలీ

హన్మకొండ కల్చరల్: వరంగల్ దేవాదాయ, ధర్మాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీకాంతారావును కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. సికింద్రాబాద్ ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కేఎన్.సంధ్యారాణికి వరంగల్ డిప్యూటీ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ కూరాకుల జ్యోతి ఉత్తర్వులు జారీ చేశారు.

నిట్‌లో టీచ్-25 ఎఫ్‌డీపీ

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో టీచింగ్ ఇంగ్లిష్ విత్ ఏఐ, క్రిటికల్ పెడగాలజీ అండ్ హిస్టరీ పేరుతో టీచ్–25 ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) మంగళవారం ప్రారంభమైంది. వారం రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా శ్రీలంక డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ సమరవీర మాట్లాడారు. 21వ సెంచరీలో ఎదురవుతున్న సవాళ్లను యువత ఎదుర్కొనేందుకు ఎఫ్‌డీపీ వేదికగా నిలవాలన్నారు. ప్రొఫెసర్ కిశోర్‌కుమార్, విశ్వనాథన్, వెన్నెల పాల్గొన్నారు.

అకౌంట్ నుంచి రూ.87,500 మాయం

కమలాపూర్ : సైబర్ నేరగాళ్లు ఒకరి బ్యాంకు ఖాతా నుంచి రూ.87,500 మాయం చేసిన ఘటన కమలాపూర్ మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. భీంపల్లికి చెందిన పసుల వీరప్రభాకర్ ఎస్‌బీఐ అకౌంట్ నుంచి గత నెల 30న ఉదయం సుమారు రూ.5 వేలు, మధ్యాహ్నం 12 గంటలకు రూ.22,500, ఆ తర్వాత 3 గంటలకు రూ.30 వేలు, 3.45 గంటలకు రూ.30 వేలు చొప్పున మొత్తం నాలుగు విడతలుగా రూ.87,500 డ్రా అయ్యాయి. దీంతో బాధితుడు లబోదిబోమంటూ గత నెల 31న సైబర్ క్రైం విభాగానికి ఫిర్యాదు చేశాడు. అనంతరం మంగళవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు.

వైద్యులు సమయపాలన పాటించాలి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య
- శాయంపేట పీహెచ్‌సీలో తనిఖీలు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ అప్పయ్య

శాయంపేట: వైద్యులు సమయపాలన పాటించాలని, హెచ్ఎంపీవీపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, హాజరు పట్టికలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆశ డే కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మాట్లాడారు. కొత్తగా ప్రజలను భయపడుతున్న హెచ్ఎంపీవీపై ప్రజలకు వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు గుంపులుగా ఉండొద్దని, మాస్కులు తప్పనిసరిగా ధరించాలని, చేతులు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు వివరించాలని చెప్పారు. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు శశికుమార్, విద్యశ్రీ, సీహెచ్ఓ సుగుణ, హెచ్ఈఓ వెంకటేశ్వరవర్మ, సూపర్‌వైజర్లు, సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీ వైద్యులపై చర్యలకు సహకరించాలి

- ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి



సీపీకి మొక్క అందజేస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

ఎంజీఎం: నకిలీ వైద్యులపై ఐఎంఏ, తెలంగాణ వైద్య మండలి(టీజీఎంసీ) తీసుకుంటున్న చర్యలకు పోలీసు శాఖ సహకరించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను ఐఎంఏ జిల్లా నూతన అధ్యక్షుడు డాక్టర్ కె.నాగార్జునరెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం సీపీతోపాటు, డీసీపీ షేక్‌సలీమాను ఐఎంఏ జిల్లా నూతన కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా నాగార్జునరెడ్డి మాట్లాడుతూ పరిస్థితి విషమంగా ఉన్న రోగులకు చికిత్స అందించే క్రమంలో మృతి చెందితే డాక్టర్ల నిర్లక్ష్యం లేకున్నా శవ రాజకీయాలు చేస్తున్నారని పేర్కొన్నారు. డబ్బుల కోసం రోగి బంధువులు కొంత మందితో కుమ్మక్కై హాస్పిటళ్లు, సిబ్బందిపై దాడులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మానసిక స్థైర్యం కోల్పోయి ఇలాంటి కేసులను హైదరాబాద్‌కు పంపిస్తున్నామని చెప్పారు. దీంతో పేద, మధ్యతరగతి వారిపై మరింత ఆర్థిక భారం పడుతోందని తెలిపారు. ఇలాంటి అసాంఘిక శక్తులకు చోటివ్వకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఐఎంఏ సేవా కార్యక్రమాలకు పోలీసు శాఖ సహకారం ఉంటుందని, సంక్రమిత, దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు మరిన్ని శిబిరాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సీపీ సూచించారు. ఐఎంఏ జిల్లా సెక్రటరీ డాక్టర్ అజిత్ మహమ్మద్, టీజీఎంసీ పీఆర్ కమిటీ చైర్మన్, ఐఎంఏ ఉపాధ్యక్షుడు డాక్టర్ వి.నరేశ్‌కుమార్, ప్రెసిడెంట్ ఎలక్ట్ డాక్టర్ మన్మోహన్ రాజు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు అమ్ముకున్నారు

హసన్‌పర్తి : మండలంలోని వంగపహాడ్ పీఏసీఎస్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు అమ్ముకున్నారని పాలకవర్గ సభ్యులు ఆరోపించారు. ఈమేరకు జిల్లా సహకార సంఘం అధికారికి మంగళవారం ఫిర్యాదు చేశారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో విధులు నిర్వర్తిస్తున్న రాజిరెడ్డి ధర్మసాగర్ పీఏసీఎస్‌కు బదిలీ కావడంతో ఆ స్థానం ఖాళీ అయింది. దీంతో పాటు సేల్స్‌మెన్, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి తీర్మానం చేశారు. అయితే సీఈఓ పోస్టుతో పాటు సేల్స్‌మెన్, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులను రహస్యంగా రూ.1.50 లక్షలకు అమ్ముకున్నాడని సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు.పాలక వర్గానికి తెలియకుండానే పోస్టులు అమ్ముకున్నానని సభ్యులు వివరించారు. ధాన్యం కొనుగోలు వ్యవహారాల్లో కూడా అవినీతి జరిగినట్లు ఆ ఫిర్యాదులో వెల్లడించారు. సొసైటీలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని వారు విజ్ఞప్తి చేశారు.

తీర్మానం మేరకే భర్తీ..
మేర్గు రాజేశ్, సొసైటీ చైర్మన్

పాలక వర్గ తీర్మానం మేరకు ఉద్యోగాల ఖాళీలు భర్తీ చేశామని చైర్మన్ రాజేశ్ తెలిపారు. పారదర్శకంగా నియామకాలు చేపట్టినట్లు చెప్పారు. కొంతమంది డైరెక్టర్లు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

వినతులు.. ఫిర్యాదులు



కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

వరంగల్: వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణిని పలు పరిపాలనా కారణాలతో మంగళవారం చేపట్టారు. మొత్తం 88 అర్జీలు రాగా కలెక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి ప్రజల నుంచి స్వీకరించి.. సంబంధిత శాఖల అధికారులకు పంపించారు. డీఆర్ఓ విజయలక్ష్మి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, ఆర్డీఓలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి , అధికారులు పాల్గొన్నారు.

అలర్ట్.. అలర్ట్



పండుగకు ఊరెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాల్సిందే..
- వరంగల్ నగరంలో వరుస చోరీలతో ఆందోళన
- తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా అంతర్ రాష్ట్ర ముఠా పంజా
- ఒక్క రోజులోనే నాలుగు దొంగతనాలతో హల్‌చల్
- ఠాణాలో వివరాలు ఇస్తే ఆయా ప్రాంతాల్లో పెట్రోలింగ్



గవిచర్లలో దొంగతనానికి వచ్చిన సమయంలో సీసీ కెమెరాకు చిక్కిన దొంగలు (ఫైల్)

సాక్షి, వరంగల్ :

సంక్రాంతి పండుగ సమీపిస్తున్న వేళ అంతర్ రాష్ట్ర ముఠాలు పంజా విసురుతున్నాయి. ఉదయం వేళ రెక్కీ చేస్తున్న ఆయా ముఠాల సభ్యులు.. రాత్రి వేళ తమ ప్రణాళికను విజయవంతంగా అమలు చేస్తున్నారు. ఈనెల మూడో తేదీ అర్ధరాత్రి దాటాక వరంగల్ నగరంలో నాలుగు చోరీలు చేయడం జనాలను ఆందోళనకు గురి చేస్తోంది. ముఖ్యంగా ఖమ్మం జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న వైన్స్‌షాపులో రూ.54 వేలు, మామునూరు పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న రెగ్జిన్, క్యాప్స్, కూలింగ్ గ్లాసులు విక్రయించే ఓ డబ్బాలో రూ.50 వేల విలువైన సామగ్రి, మడికొండలోని ఓ వైన్ షాపులో రూ.20 వేల నగదుతోపాటు గ్రేటర్ వరంగల్ 43వ డివిజన్ గవిచర్ల క్రాస్‌రోడ్డులోని శేషాద్రి హిల్స్‌లో తాళం వేసిన ఓ ఇంట్లో చొరబడి రూ.లక్ష విలువ చేసే బంగారాన్ని చోరీ చేయడం కలకలం సృష్టిస్తోంది.

పోలీసులు అప్రమత్తం..

నగరానికి చెందిన అనేక మంది సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్తున్నారు. ఈక్రమంలో ఈ ముఠాలు అందినకాడికి దండుకునే అవకాశముందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. గతేడాది నవంబర్‌లో రాయపర్తి ఎస్‌బీఐలో జరిగిన 19 కిలోల బంగారం చోరీ పోలీసులకు సవాల్ విసురుతోంది. ఇప్పుడు కూడా అదే తరహాలో ఇళ్లలో చోరీ జరిగే అవకాశముందన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలో తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా అంతరాష్ట్ర ముఠా చోరీలు చేస్తుండడంతో అప్రమత్తంగా ఉండాలని వరంగల్ కమిషనరేట్ పోలీసులు కోరుతున్నారు.

ఊరెళితే సమాచారం ఇవ్వాలి...

సంక్రాంతి వేళ కాజీపేట, హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లోని చాలా కుటుంబాలు సొంతూళ్లకు వెళ్తాయి. ఈక్రమంలో నగరంలో చాలా చోట్ల తాళం వేసిన ఇళ్లే దర్శనమిస్తాయి. ఇదే అదునుగా అంతర్ రాష్ట్ర ముఠా దొంగలు దోపిడీకి తెగించే అవకాశం ఉంది. తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్‌గా రెక్కీ నిర్వహిస్తున్నట్లు తాజాగా గవిచర్ల క్రాస్‌రోడ్డులోని ఓ ఇంట్లో దొంగతనం సమయంలో లభించిన సీసీటీవీ ఫుటేజీలు చెబుతున్నాయి. దీంతో పోలీసులు నగరవాసులను అప్రమత్తం చేస్తున్నారు. ఇంటికి తాళం వేసి సొంతూళ్లకు వెళ్లేటప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇచ్చి వెళ్లాలని వారు సూచిస్తున్నారు.

అప్రమత్తంగా లేకుంటే అంతే..

2024లో 948 చోరీలు జరిగితే 519 కేసులను పోలీసులు ఛేదించారు. రూ.24,68,26,130 సొత్తు పోతే రూ.7,18,34,683 మాత్రమే రికవరీ చేయగలిగారు. కేసుల పరిష్కారం 54.75 శాతం ఉంటే రికవరీ 29.10 శాతం మాత్రమే ఉంది. ఈ నేరాలకు పాల్పడిన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 18 ముఠాల్లోని 45 మందిని అరెస్టు చేశారు. సంక్రాంతి పండుగ వేళ ఈ అంతర్ రాష్ట్ర ముఠా కదలికలు ఉండడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. అదేసమయంలో పోలీసులకు దొంగలు సవాల్ విసురుతుండడం గమనార్హం. గవిచర్ల క్రాస్‌రోడ్డులోని సూర్యచంద్ర హిల్స్‌లో తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి ప్రయత్నించారు. అక్కడ వీలుకాకపోవడంతో సమీపంలోని శేషాద్రి హిల్స్‌లో చోరీ చేశారు. పోలీసులు, ప్రజలు అప్రమత్తంగా లేకపోతే ఎక్కువగా చోరీలు జరిగే అవకాశం ఉంది.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే రక్షణ



సంక్రాంతికి సొంతూరికి వెళ్లే ముందు ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయకండి. ఎప్పటిలాగే డోర్‌మ్యాట్ కింద, చెప్పుల స్టాండ్లలో తాళాలు వదిలి వెళ్లకండి. గ్రామాలకు వెళ్లి మూడు రోజుల పాటు పండుగ చేసుకుంటే.. మీకు తెలియకుండా ఇచ్చే సమాచారంతో దొంగలు కూడా మీ ఇంట్లో చోరీ చేసి పండుగ చేసుకునే అవకాశం ఉంది. ఇళ్లకు తాళాలు వేయాలి. వీలైతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే రక్షణగా ఉంటుంది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మీ ఇంటి నంబర్, సెల్‌ఫోన్ నంబర్ ఇవ్వడం ద్వారా ఆయా ప్రాంతాల్లో గస్తీ మరింత పెంచే అవకాశం ఉంటుంది. **- అంబర్ కిశోర్ ఝా, వరంగల్ పోలీస్ కమిషనర్**

కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలి

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కేయూ కాంట్రాక్టు అధ్యాపక సంఘం కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో కాకతీయ వర్సిటీ పరిపాలన భవనం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల సాధనకు కాంట్రాక్ట్ అసిసెంట్ ప్రొఫెసర్లు అనేక రూపాల్లో ఆందోళనలు నిర్వహించినా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డికి సంఘం బాధ్యులు వినతిపత్రం అందజేశారు.

బైలాస్‌పై అవగాహన అవసరం

- వరంగల్ డీఆర్‌డీఓ కౌసల్యాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ కౌసల్యాదేవి

వరంగల్: సెర్ప్ ఉద్యోగులు గ్రామ, మండల సమాఖ్యల ఉప విధుల నిబంధనావళి(బైలా)పై అవగాహన కలిగి ఉండాలని వరంగల్ డీఆర్‌డీఓ కౌసల్యాదేవి సూచించారు. మంగళవారం డీఆర్డీఏ కార్యాలయంలో మండల కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, ఏపీఎంలు, డీపీఎంలకు నూతన బైలాలపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డీఆర్డీఓ సెర్ప్ ఉద్యోగులకు బైలాలో పొందుపర్చిన నియమ నిబంధనలను అవగాహన కల్పించిన తర్వాతనే వీఓ, మండల ప్రతినిధుల ఈసీ, ఓబీ ఎన్నికలు నిర్వహించాలని చెప్పారు. సమాఖ్యల ఉపవిధుల నిబంధనావళి ఉల్లంఘిస్తే చట్టపరమైన చికాకులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. శిక్షణ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీఓ రేణుకాదేవి, డీపీఎంలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి

● డీఎంహెచ్ఓ సాంబశివరావు

వరంగల్: సీజనల్ వ్యాధులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, వైద్య సిబ్బంది వారిని అప్రమత్తం చేయాలని వరంగల్ డీఎంహెచ్ఓ డాక్టర్ బి.సాంబశివరావు సూచించారు. మంగళవారం వరంగల్ చింతల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన 'ఆశ డే' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. చలికాలంలో చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. మాతా శిశు సంరక్షణ, ప్రభుత్వ హాస్పిటల్‌లో డెలివరీలు, వ్యాధి నిరోధక టీకాలు, అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు దిలీప్, డెమో అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్ల స్వాధీనం



రామన్నపేట : వరంగల్‌లోని పెరుకవాడకు చెందిన వ్యాపారి గొల్ల మల్లికార్జున్ ఇంటిపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి రూ.57,200 విలువైన గుట్కాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు అతడిని అదుపులోకి తీసుకొని మట్టెవాడ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. దాడిలో ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

శివనగర్‌లో..

ఖిలా వరంగల్: మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి శివనగర్ ఏరియాలో కిరాణా వ్యాపారి వనిశెట్టి రవి నుంచి రూ. రూ.32 వేల విలువైన నిషేధిత గుట్కా స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్ మంగళవారం తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం కేసును మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు వివరించారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై దిలీప్ పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల పట్టివేత

వరంగల్ : అక్రమంగా గుట్కా విక్రయాలు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు శివనగర్, రామ్‌కీ ఎన్‌క్లేవ్, కరీమాబాద్ ప్రాంతాల్లో దాడులు చేశారు. ఈ దాడిలో వ్యాపారులు అల్లాడి సాయిరాం, చకిలం నాగరాజు, భీమనాథ్ హరితేజతో పాటు రూ.16,200ల విలువైన గుట్కాలు, పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బాబూలాల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

భూపాలపల్లి రూరల్ : విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం భూపాలపల్లి మండలం కొత్తపల్లి (ఎస్ఎం)లో చోటు చేసుకొంది. మృతుడి బంధువుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మోతే సాంబయ్య(55) వ్యవసాయంతోపాటు ఎలక్ట్రీషియన్ పనులు చేస్తుంటాడు. మోరంచ వాగు పరీవాహక ప్రాంతంలో ఓ రైతుకు చెందిన మోటారు మరమ్మతు చేస్తున్న క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. దీనిపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.




'ఆక్సిజన్'పై అప్రమత్తత అవసరం..

ఫస్ట్ వేవ్, సెకండ్ వేవ్ సమయంలో ఎంజీఎంలో కరోనా రోగులకు చికిత్స అందిస్తున్న సమయాల్లో కొన్నిసార్లు ఆక్సిజన్ కొరత వైద్యులను బెంబేలెత్తించింది. ఢిల్లీ నుంచి లిక్విడ్ ఆక్సిజన్ విమానంలో హైదరాబాద్‌కు వచ్చాక అక్కడినుంచి ట్రాఫిక్ రద్దీని తట్టుకొని ఎంజీఎం వరకు వచ్చేంత వరకు ఆగమాగం అయ్యేవారు. ఎందుకంటే ఎంజీఎంలో రెండు లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంక్‌లు ఉండడంతో ఒక ట్యాంక్ అయిపోయిందంటే చాలు వైద్యుల్లో ఆందోళన మొదలయ్యేది. ఫస్ట్ వేవ్‌లో పదివేల లీటర్లు (పది కిలో లీటర్లు), రెండో వేవ్‌లో 13,000 లీటర్లు (13 కిలో లీటర్లు) ఏర్పాటుతోనే ఉన్నంతలో రోగులకు మెరుగైన సేవలందించారు. ఈ ఆక్సిజన్ కొరత నుంచి నేర్చుకున్న పాఠాలతో ఆక్సిజన్ ఉత్పాదక ప్లాంట్‌లు వచ్చేలా చూశారు. పీఎం కేర్ నిధులతో పాటు ఎల్అండ్‌టీ కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఏర్పాటుచేసిన ఈ రెండు ప్లాంట్‌లు కలిసి నిమిషానికి రెండు వేల లీటర్ల ఆక్సిజన్ ఉత్పత్తి చేసి ఏకకాలంలో వందల మందికి క్సిజన్ అందించనున్నాయి. ఫలితంగా చాలామంది ప్రాణాలు నిలబడే అవకాశం ఉంది. అదే విధంగా కరోనా సమయంలో మంజూరైన 100 వెంటిలేటర్లు ఆస్పత్రిలోనే ఉన్నాయి. అయితే వీటన్నింటిపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండటంతోపాటు సరిపడే సిబ్బంది ఉండేలా చూడాల్సి ఉంది.



ఆస్పత్రి ఆవరణలోని ఆక్సిజన్ ప్లాంట్లు





వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రి

హెచ్‌ఎంపీవీ కలకలం

తెరమీదకు మరో మహమ్మారి

● ఉత్తర తెలంగాణ గుండెకాయ ఎంజీఎం.. ఈ ఆస్పత్రిపైనే అందరి ఆశలు
● కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాలను తాకిన 'హ్యూమన్ మెటాన్యూమో'
● ప్రబలుతున్న చైనా వైరస్‌పై ఆందోళన..

సాక్షిప్రతినిధి, వరంగల్ : చైనాను గడగడలాడిస్తున్న హ్యూమన్ మెటాన్యూమో వైరస్ (హెచ్ఎంపీవీ) భారత్‌కు చేరుకుంది. కర్ణాటకలో సాధారణ పరీక్షల సమయంలో భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) రెండు హెచ్ఎంపీవీ కేసులను గుర్తించిందని ఎక్స్ వేదికగా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ రెండు కేసుల్లోనూ పిల్లల్లోనే ఈ వైరస్ కనిపించగా, ఇందులో రాజస్తాన్‌లోని డెంగర్‌పూర్ నుంచి సర్వార్‌కు వచ్చిన ఓ చిన్నారి ఈ వైరస్ బారిన పడినట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో బెంగళూరులో 8 నెలల చిన్నారి హెచ్ఎంపీవీ బారిన పడి ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ నేపథ్యంలో హెచ్ఎంపీవీ వైరస్‌పై కేంద్రం రాష్ట్రాలను అప్రమత్తం చేయగా.. హెచ్ఎంపీవీ వైరస్ అంటే ఏమిటి..? దాని లక్షణాలు ఏమిటి..? చికిత్సలు ఎలా? ఈ పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై వైద్య ఆరోగ్యశాఖ దృష్టి సారించింది. ఇదే సమయంలో ఉత్తర తెలంగాణ (కాళ్వేరం, రాజన్న, బాసర, భద్రాద్రి)లోని 18 జిల్లాలకు గుండెకాయల ఉన్న వరంగల్ మహాత్మగాంధీ మెమోరియల్ ఆస్పత్రిలో వసతులపై చర్చ జరుగుతోంది.



ఆస్పత్రిలోని ఓ వార్డులో ఉన్న ఆక్సిజన్ బెడ్లు

ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్సలకు సర్వం సిద్ధం



ఎంజీఎం ఆస్పత్రిలో ఎలాంటి ఫ్లూ లక్షణాలతో అడ్మిట్ అయిన రోగులకు చికిత్సలు అందించేందుకు సర్వం సిద్ధంగా ఉన్నాం. హెచ్ఎంపీవీ వైరస్ సైతం శ్వాసకోశ ఇబ్బందులకు గురి చేసే క్రమంలో ప్రస్తుతానికి ఆస్పత్రిలో 500కు పైగా ఆక్సిజన్ పడకలు అందుబాటులో ఉన్నాయి. ఆస్పత్రిలో 10,000 లీటర్లు, 13,000 లీటర్ల లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్లతో పాటు రెండు ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయి. అలాగే 100కు పైగా ఐసోలేషన్ పడకలు సైతం ఉన్నాయి.

– కిశోర్, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్, ఎంజీఎం, వరంగల్

కోవిడ్-19ను మించిన మరో వైరస్.. పరీక్షల నుంచి వైద్యం వరకు ఎంజీఎం..

కోవిడ్–19ని మించిన వేగంతో హెచ్ఎంపీవీ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ వైరస్ శ్వాసకోశ సంబంధిత ఇన్‌ఫెక్షన్ కావడంతో జాగ్రత్తగా ఉండాలని కూడా వారు చెబుతున్నారు. ఇదే సమయంలో మెరుగైన వైద్యసేవలు అందించే ప్రభుత్వ ఆస్పత్రుల నిర్వాహకులను అప్రమత్తం చేస్తున్నారు. అనుకోని విపత్తుగా వస్తున్న మరో వైరస్‌పై పోరుకు ఎంజీఎం అడుగులు వేయాల్సి ఉంది. కరోనా సమయంలో 1250 పడకల ఈ ఆస్పత్రిలో మరో వంద పడకలు అదనంగా ఏర్పాటు చేశారు. కాకతీయ మెడికల్ కాలేజీ ప్రాంగణంలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో మరో 250 పడకలు కూడా ఉపయోగంలోకి తెచ్చారు. కరోనా నిర్ధారణ పరీక్షల నుంచి వైద్య సేవల వరకు ఎంజీఎంలోనే జరిగాయి. ఫస్ట్ వేవ్ సమయంలో కరోనా పరీక్షలు చేస్తే ఆ నివేదిక రోగి చేతికందే సరికి మూడురోజుల సమయం తీసుకునేది. హైదరాబాద్‌లోని ఐపీఎంకు వెళ్లి అక్కడినుంచి నివేదిక వచ్చేవరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేది. ఈ మూడు రోజుల్లోనే కరోనా వచ్చిందన్న బెంగతో మరింత బలహీనంగా మారి అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రిలో చేరినవారు ఉన్నారు. ఈ నేపథ్యంలో అప్పటి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ 2017లోనే ప్రతిపాదించిన వైరల్ రీసెర్చ్ డయాగ్నస్టిక్ ల్యాబ్ ప్రస్తుతం అందుబాటులో ఉంది.

జాతరలో సౌకర్యాలు కల్పించాలి

● పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క
● మినీ మేడారంపై సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు : మేడారం సమ్మక్క–సారలమ్మ సన్నిధిలో భక్తుల అవసరాలకు అనుగుణంగా అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క సూచించారు. ఈ మేరకు మంగళవారం జిల్లాకేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో వచ్చే నెల 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరగనున్న మేడారం మినీ జాతరపై కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ డాక్టర్ శబరీశ్, ఐటీడీఏ పీఓ చిత్రామిశ్ర, డీఎఫ్ఓ రాహుల్‌కిషన్ జాదవ్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. నాణ్యతతో పనులు చేపట్టి శాశ్వతంగా నిలిచిపోయేలా చూడాలన్నారు. మహా జాతరలో సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే భక్తుల రాక పెరిగిందని, ఫిబ్రవరి మొదటివారం నుంచి మరింత తాకిడి ఎక్కువవుతుందన్నారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు క్యూలైన్లు, తాగునీటి సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎక్కడ లోపం లేకుండా ప్రతీ ప్రాంతం శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని డీపీఓ దేవరాజ్‌ను ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, మరుగుదొడ్లను ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు. జంపన్నవాగు వద్ద నల్లాలు ఏర్పాటు చేసి, దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక షెడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. సమావేశంలో దేవాదాయశాఖ ఈఓ రాజేందర్, డీఎస్పీ రవీందర్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐలోని జాతరను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు, పక్కన మేయర్ సుధారాణి, కలెక్టర్ ప్రావీణ్య, కుడా చైర్మన్,తదితరులు

● ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు కావాలి
● దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కోరిన వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు : భక్తులకు వసతుల కల్పనలో ఎక్కడా కాంప్రమైజ్ కావొద్దు.. గతంలో కంటే వైభవంగా జాతరను విజయవంతం చేయాలి.. ప్రభుత్వానికి చెడ్డ పేరు రావొద్దని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆలయ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే అధ్యక్షతన మల్లికార్జున స్వామివారి ఆలయ ప్రాంగణంలోని అన్నదాన సత్రంలో జాతరపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులు మేయర్ గుండు సుధారాణి, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో పాటు కలెక్టర్ ప్రావీణ్య, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ముందుగా ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు చేపట్టాల్సిన పనులను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే ఒక్కో శాఖను రివ్యూ చేశారు. మహిళా భక్తులు ఇబ్బందులు పడుతున్నారన్న అంశానికి కలెక్టర్ ప్రావీణ్య స్పందించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లను తక్షణమే ప్రారంభించాలని అందుకు తగిన నిధులు మంజూరు చేస్తామన్నారు. మేయర్ సుధారాణి, 'కుడా' చైర్మన్ వెంకట్రాంరెడ్డి మాట్లాడారు. అనంతరం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వీడియో కాల్ ద్వారా అందుబాటులోకి వచ్చారు. ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్ల నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే నాగరాజు విజ్ఞప్తి చేశారు. కాగా, చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్దేశం చేస్తూ జాతరను విజయవంతం చేయాలని మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. అయితే నిధుల గురించి మాత్రం స్పందించలేదు. అనంతరం పున్నేలు క్రాస్ వద్ద నిర్మించిన డబుల్ ఆర్చి గేట్‌ను ప్రారంభించారు. అలాగే లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ అప్పయ్య, డీసీపీ పులిగిల్ల రవీందర్, ఆర్‌డీఓ రమేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, జాతర అభివృద్ధికి నిధుల మంజూరుపై విలేకరుల అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ ప్రభుత్వం ఈసారి ఎలాంటి నిధుల కేటాయించలేదన్నారు.

ఇంటర్ వర్సిటీ వాలీబాల్ కేయూ మహిళా జట్టు



కేయూ వాలీబాల్ ఉమెన్ జట్టుతో వెంకయ్య

కేయూ క్యాంపస్: చైన్నైలోని జెప్పాలార్ యూనివర్సిటీలో ఈనెల 7న ప్రారంభమై 11వతేదీ వరకు కొనసాగనున్న ఆల్‌ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ వాలీబాల్ పోటీలకు కాకతీయ యూనివర్సిటీ మహిళా జట్టును ఎంపిక చేశామని స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ ఆచార్య వై. వెంకయ్య మంగళవారం తెలిపారు. ఎం. ప్రవంతి, కె.అనూష(యూసీపీఈ కేయూ వరంగల్), ఎస్. అనుకావ్యాంజలి, డి. వైష్ణవి (టీఎస్‌డబ్ల్యూ ఆర్‌డీసీ, ఉమెన్) వరంగల్ వెస్ట్), షేక్‌ఆశాబేగం (కొత్తగూడెం ఇంజనీరింగ్ కాలేజీ), ఎ. నందిని, ఎం. శ్యామల(టీజీడబ్ల్యూఆర్‌డీసీ కొత్తగూడెం), టి.సీతామహలక్ష్మి (టీజీడబ్ల్యూ ఆర్‌డీసీ, దమ్మపేట), టి. చందన (టీజీడబ్ల్యూఆర్‌డీసీ ఖమ్మం), ఎం.పావని (వీసీపీఈ బొల్లికుంట, వరంగల్), జి. ఐశ్వర్య(యూఏఎస్‌సీ,హనుమకొండ), బి. ఆశ్మిత (వాగ్దేవి డిగ్రీ కాలేజీ ,హనుమకొండ), ఎం. సౌజన్యరాణి, టి. పూజిత (కిట్స్,వరంగల్) ఉన్నారు. ఈ జట్టుకు వరంగల్‌కిట్స్ ఫిజికల్‌డైరెక్టర్ కె. వెంకటస్వామి కోచ్‌అండ్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారని వెంకయ్య తెలిపారు.

విద్యార్థులు ప్రణాళికాప్రకారం చదవాలి

● ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ యాదగిరి



మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు డిప్యూటీసెక్రటరీ, ఉమ్మడి జిల్లా అబ్జర్వర్ యాదగిరి, పక్కన డీఐఈఓ గోపాల్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్

విద్యారణ్యపురి: ఇంటర్ మొదటి,సెకండియర్ పరీక్షలు సమీపిస్తున్నాయని, విద్యార్థులు ప్రణాళికా ప్రకారం చదువుకోవాలని ఇంటర్మీడియట్‌బోర్డు డిప్యూటీసెక్రటరీ, ఉమ్మడి వరంగల్ జిల్లా అకడమిక్ అబ్జర్వర్ టి. యాదగిరి సూచించారు. అలాగే, ఉత్తమ ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. మంగళవారం ఉదయం తొలుత హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (కోఎడ్యుకేషన్)ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు ఎన్ని యూనిట్ టెస్టులు నిర్వహించారని అడిగి తెలుసుకున్నారు. సైన్స్‌ల్యాబ్‌లను పరిశీలించారు. అకడమిక్ పరంగా విద్యార్థుల రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఆర్. శ్రీనివాస్, ఆ కళాశాల అధ్యాపకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కృష్ణ ఆదిత ఇంటర్‌విద్య పటిష్టానికి తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంపుదల చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన వెంట డీఐఈఓ ఎ. గోపాల్ ఉన్నారు. అనంతరం జిల్లాలోని శాయంపేట, ఆత్మకూరు, పరకాల ,హసన్‌పర్తి, ధర్మసాగర్ ప్రభుత్వజూనియర్ కళాశాలలను సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులు, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో మాట్లాడి అత్యధికంగా ఉత్తీర్ణతశాతం పెంపుదలకు కృషి చేయాలని కోరారు.

నకిలీ వైద్యుడి గుట్టు రట్టు

● అక్రమంగా నిల్వ చేసిన మందులు స్వాధీనం
● డ్రగ్స్ అండ్ కాస్మొటిక్ చట్టం–1940 కింద కేసు నమోదు



తనిఖీల్లో పాల్గొన్న మెడికల్ టాస్క్ ఫోర్స్ బృందం



స్వాధీనం చేసుకున్న మందులు

ఎంజీఎం/ఖిలా వరంగల్ : వరంగల్ జిల్లా మెడికల్ టాస్క్ ఫోర్స్ బృందం నకిలీ వైద్యుడి గుట్టు రట్టు చేసింది. నగరంలోని కరీమాబాద్‌కు చెందిన ఎ.దిలీప్ ఫిజియోథెరపీ చదివిన తాను.. డాక్టర్, జనరల్ ప్రాక్టీషనర్ అని పేర్కొంటూ ఆధునిక వైద్యం చేయడంతో పాటు అక్రమంగా మందులు నిల్వ చేశాడు. టాస్క్ ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహించి నకిలీ వైద్యుడి గుట్టు రట్టు చేసినట్లు వరంగల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అరవింద్ కుమార్ తెలిపారు. ఔషధ నియంత్రణ అధికారుల అనుమతి లేకుండా సుమారు రూ.3వేల విలువైన మందులు నిల్వ ఉంచినందుకు డ్రగ్స్ అండ్ కాస్మొటిక్ చట్టం–1940 సెక్షన్ 18సి ప్రకారం కేసు నమోదుతో పాటు మరిన్ని చర్యలకు తెలంగాణ వైద్య మండలికి కూడా సిఫారసు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 'ఫిజియోథెరపీ చదివిన వారు డాక్టర్స్ కాదు.. అలా బోర్డు పెట్టుకోకూడదు.. ఆధునిక వైద్యం చేసే అర్హత వారికి లేదు.. ఎటువంటి అల్లోపతి మందులు రాయకూడదు.. ఇంజక్షన్ ఇవ్వకూడదు.. వారు చేసే ఫిజియోథెరపీ ప్రాక్టీస్‌కు కూడా జిల్లా వైద్యాధికారుల అనుమతి తప్పనిసరి' అని టీజీఎంసీ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఐఎంఏ రాష్ట్ర యాంటీ క్వాకరీ చైర్మన్ డాక్టర్ అశోక్‌రెడ్డి, ఐఎంఏ వరంగల్ జిల్లా కోశాధికారి డాక్టర్ శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ సమస్యలు పరిష్కరించండి

● మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చాంబర్ ప్రతినిధులు వినతి



మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చాంబర్ ప్రతినిధులు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లోని సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని తెలంగాణ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంత్రిని హైదరాబాద్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం కలసి వరంగల్ వ్యవసాయ మార్కెట్ రైతులు, హమాలీలు, కార్మికులు, వ్యాపారుల ఇబ్బందులు, సీసీ కెమెరాలు లేకపోవడం వల్ల ఎదుర్కొంటున్న సమస్యలు, ఇంటర్నెట్ వైఫై, ఇంటిగ్రేటెడ్ వెయింగ్ మిషన్లు పనిచేయకపోవడం వలన ఎదురవుతున్న ఆటంకాలను వివరించారు. అలాగే, వ్యవసాయ మార్కెట్‌కు 15 కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్న రైతు సరుకుల ప్రాసెసింగ్ పరిశ్రమలకు సరుకు రవాణా చేసేందుకు రోడ్ల నిర్మాణం చేపట్టాలని అభ్యర్థించారు. వ్యవసాయ మార్కెట్‌లో చాంబర్ ఆఫ్ కామర్స్‌కు కేటాయించిన స్థలానికి నామమాత్రపు లీజు నిర్ణయించి రైతు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ట్రేడ్ ప్రమోషన్ సెంటర్ నిర్మాణానికి అనుమతించాలని కోరారు. జిల్లాలో వ్యాల్యూ యాడెడ్ పరిశ్రమల అభివృద్ధికి కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించి జిల్లా అభివృద్ధికి తోడ్పాటునందించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కటకం పెంటయ్య, అల్లే సంపత్, చింతలపల్లి వీరారావు, లింగారెడ్డి, రాజేశ్, కరాణి, గోని సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



అథ్లెట్లను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్ : సీఎం కప్ క్రీడాపోటీల్లో హనుమకొండ జిల్లా నాల్గో స్థానాన్ని కైవసం చేసుకుందని డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిల చొరవతో క్రీడాకారులకు ప్రోత్సాహం, పోటీల నిర్వహణకు సహకారం అందించడంతోనే ఈ స్థాయిలో నిలిచామని అన్నారు. క్రీడాకారులను ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్స్ సంఘం చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్, బాధ్యులు సారంగపాణి, శ్యామల పవన్, ఎండీ కరీం, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ పి.రమేష్‌రెడ్డి, తోట శ్యామ్ తదితరులు అభినందించారు.

అథ్లెట్లను అభినందించిన ఎమ్మెల్యే..

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో హనుమకొండకు చెందిన సరస్వతి 100, 200 మీటర్ల రన్నింగ్ గోల్డ్, ట్రిపుల్ జంప్‌లో కాంస్య పతకం సాధించింది. ట్రిపుల్ జంప్‌లో సాయి చరణ్ గోల్డ్ మెడల్ సాధించారు. ఇద్దరు అథ్లెట్లను మంగళవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో అభినందించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

● వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి
● నేషనల్ హైవే అథారిటీ అధికారులతో సమీక్ష



సమీక్ష సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యే

సాక్షి ప్రతినిధి, వరంగల్: నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ)కు సంబంధించి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులకు సూచించారు. హనుమకొండ కనకదుర్గకాలనీలోని ఎమ్మెల్యే శ్రీహరి నివాసంలో ఎన్‌హెచ్ అథారిటీ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. జనగామ ఆర్‌ఓబీ నుంచి కరుణా‌పురం వరకు అన్ని గ్రామాల్లో సైడ్ డ్రెయినేజీలు నిర్మించారని, అయితే ఆ డ్రెయినేజీ నీరు బయటకు వెళ్లకుండా గ్రామాల్లోకే వస్తోందన్నారు. ఆ నీరు బయటకు వెళ్లేలా నిర్మాణం చేపట్టాలని సూచించారు. వరంగల్ నుంచి జనగామ పట్టణానికి వెళ్లే జంక్షన్‌లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జంక్షన్ అభివృద్ధి చేయాలన్నారు. జనగామ, సూర్యాపేట ఆర్‌ఓబీకి ఇరువైపులా ఉన్న అప్రోచ్ రోడ్లు, 'యు' టర్నులు సరిగా లేవని, వెంటనే వాటిని సరిచేయాలని చెప్పారు. స్టేషన్‌ఘన్‌పూర్, నిడిగొండ, ఛాగల్, చిన్నపెండ్యాల గ్రామాల్లో సర్వీస్ రోడ్డు చివరి వరకు బారికేడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. వీటన్నింటినీ స్వయంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని ఎన్‌హెచ్ఏఐ పీడీ హామీ ఇచ్చారు. అలాగే చిన్నపెండ్యాల గ్రామం వద్ద సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు రూ.27లక్షలు మంజూరయ్యాయని, త్వరలోనే టెండర్ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

ఖోఖో సమరానికి వేళాయె..

● రేపటి నుంచి రాష్ట్రస్థాయి సీనియర్ పోటీలు
● తరలిరానున్న 350మంది క్రీడాకారులు



సాధన చేస్తున్న జిల్లా బాలుర జట్టు క్రీడాకారులు

గీసుకొండ : వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రంలోని జెడ్పీ మైదానంలో ఈనెల 9వ తేదీ(రేపటి)నుంచి 11వ తేదీ వరకు రాష్ట్రస్థాయి బాలుర, బాలికల సీనియర్ ఖోఖో పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 350 మంది క్రీడాకారులు తరలిరానున్నారు. విజేతలతో పాటు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను త్వరలో జైపూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. కాగా, రాష్ట్రంలో తొలిసారి మ్యాట్‌లు ఏర్పాటు చేసి పోటీలు నిర్వహించనున్నారు.

భారీగా దాతల సాయం..

మ్యాట్ కోసం జంగా రాఘవరెడ్డి రూ.10లక్షలు అందించగా, మనుగొండకు చెందిన కాంగ్రెస్ జిల్లా నాయకుడు, పోటీల నిర్వహణ కమిటీ చైర్మన్ అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ.5 లక్షల సాయం అందించారు. ఎస్‌బీఐ రిటైర్డ్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ రూ.50 వేలు అందించారు. ఏనుగుల సాంబరెడ్డి, ప్రవాస భారతీయుడు డాక్టర్ పసునూరి కల్యాణ్ చేరొ రూ.50 విరాళంతో పాటు పలువురు దాతలు సాయం చేశారు.

యువతను ప్రోత్సహిస్తున్నాం..



యువత వ్యసనాలకు దూరంగా ఉండాలనే టోర్నీ నిర్వహణకు సాయం అందించా. జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగేలా ప్రోత్సహిస్తున్నాం. టోర్నీ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

– అల్లం బాలకిశోర్‌రెడ్డి, టోర్నమెంట్ చైర్మన్

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం..



రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు విజయవంతం చేసేందుకు బాలకిశోర్‌రెడ్డి సహకారంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. క్రీడాకారులకు వసతి, భోజన, నీటి సదుపాయం కల్పించాం.

– వీరగోని రాజ్‌కుమార్, టోర్నమెంట్ కన్వీనర్

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

అమ్మకానికి కలదు

■ Restaurant/ హోటల్ అమ్మకానికి కలదు కిట్స్ కాలేజి ప్రక్కన, ఎర్రగట్టు గుట్ట, సంప్రదించవలసిన ఫోన్ నెం: 9281474365. [W-1264116]

SERVICES

FINANCIAL SERVICES

■ సిరి అసోసియేట్స్: హౌసింగ్, మార్టిగేజ్, బిజినెస్, పర్సనల్, ఓపెన్ ప్లాటు, రేకుల ఇల్లు, గూన పెంక ఇల్లు, సిబిల్ లేకున్న రుణాలు ఇప్పించబడును. సంప్ర!! 9440863470. [W-1264166]

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9177555694. [SCA25001023]

■ కంపెనీ అన్ని రకాల వ్యాపార, ప్రాజెక్ట్‌ల, వ్యక్తిగత, వ్యవసాయ, విద్య రుణాల సలహాలకు సంప్రదించండి DMA స్వాగతం. జీతం + కమీషన్. ✆ 9671637906. [T-297]

WANTED

■ మా అపార్ట్‌మెంట్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్, వాచ్‌మెన్స్, స్వీపర్స్ స్త్రీ, పురుషులు అర్జెంటుగా కావలెను. సంప్ర: 9491710857, 7382106287 [W-1264181]

■ మా ఆఫీసులో పనిచేయుటకు అర్జెంటుగా స్త్రీలు కావలెను. Cont: 7382323126 [W-1264180]

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 15,000 నుండి 20,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256025]

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256030]

■ హరేకృష్ణ హోం కేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 18K. Ph: 9640468899, 9640258899 [SCA25001049]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగాము	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.